క్లుప్తంగా

మహిళా జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి అమానుషం

కాజులూరు: బీసీ మహిళా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై కుటమి నేతలు దాడి చేయటం అమానుషమైన చర్య అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం గొల్లపాలెంలో మండల గ్రామాలకు చెందిన బీసీ సంఘ సభ్యులతో సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో తప్పుడు వాగ్దానాలు చేసిన కూటమి నేతలు ఏ ఒక్కటి పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను పక్కదారి పట్టించేందుకు రెడ్ బుక్ పేరుతో అరాచకాలు సృష్టిస్తున్నారన్నారు. బీసీ మహిళా నేతలను సైతం తీవ్రంగా అవమానిస్తున్నారని మండిపడ్డారు. బీసీలను నిర్లక్ష్యం చేసిన ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సంఘం అధ్యక్షుడు చొల్లంగి రమణ, మండల సేవాదళ్ అధ్యక్షుడు పాలిక వీరబాబు, సంఘ సభ్యులు గుత్తుల లోవరాజు, ఈశ్వరరావు, పెంకే దుర్గాప్రసాద్, దంగేటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా క్లస్టర్ కాంప్లెక్స్‌లలో సమావేశాలు



కాట్రేనకోన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో టీచర్లకు సూచనలిస్తున్న డీఈవో

రాయవరం: జిల్లా వ్యాప్తంగా 87 క్లస్టర్ కాంప్లెక్స్‌ల్లో శనివారం సమావేశాలు నిర్వహించారు. సమగ్ర శిక్షా రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సమావేశాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 5,588 మంది ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో ముందుగా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం సమావేశాలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా కాట్రేనికోన మండలం దొంతికుర్రు క్లస్టర్ కాంప్లెక్స్‌లో పాల్గొన్నారు. ఆత్రేయపురం మండలం పేరవరం, కొత్తపేట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల్లో సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ జి.మమ్మీ హాజరయ్యారు. సమావేశాల్లో ఉపాధ్యాయుల హాజరును వారు పరిశీలించారు. అలాగే ఉప విద్యాశాఖాధికారులు జి.సూర్యప్రకాశరావు, పి.రామలక్ష్మణమూర్తి, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు సమావేశాలను పర్యవేక్షించారు.

సాదాసీదాగా మండల పరిషత్ సమావేశం



సర్వసభ్య సమావేశంలో అధికారులను వివరణ అడుగుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన శనివారం ఈ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వెంటూరు ఎంపీటీసీ వాసంశెట్టి విజయకుమార్ మాట్లాడుతూ, వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికి వెళ్లి రేషన్ ఇవ్వకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. 75 ఏళ్ల వయసున్న తన తండ్రికే రేషన్ ఇవ్వలేదని విజయకుమార్ చెప్పడంతో సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు జోక్యం చేసుకున్నారు. ఎందుకు ఇంటికి వెళ్లి రేషన్ ఇవ్వట్లేదని తహసీల్దారు ఐపీ శెట్టిని ప్రశ్నించారు. ప్రతి నెలా 30వ తేదీలోగా వృద్ధులు, దివ్యాంగుల ఇంటికి రేషన్ ఇంటి వద్దకే అందజేయాలని సూచించారు. సమావేశంలో మండపేట ఏఎంసీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

సాగుకు చొరవ చూపాలి

కాజులూరు: తొలకరి సాగుకు రైతులు చొరవ చూపాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మండలంలోని చేదువాడ, బందనపూడి, కాజులూరు తదితర గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. బందనపూడిలో ఆయన మాట్లాడుతూ, గోదావరి తూర్పుడెల్టా కాలువకు ఇరిగేషన్ అధికారులు సాగునీరు విడుదల చేశారని చెప్పారు. పంట కాలువల ద్వారా పొలాలకు సాగునీరు చేరుతుందని, రైతులు దమ్ములకు సిద్ధం కావాలన్నారు. ఈ నెలాఖరిలోపు నాట్లు పూర్తి చేసినట్లయితే అక్టోబరు నెలాఖరి నాటికి పంట ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా చేతికొస్తుందన్నారు.

హోమియో వైద్య శిబిరం

కపిలేశ్వరపురం (మండపేట): అర్తమూరుకు చెందిన ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు సామాజిక స్పృహతో సేవలందిస్తోందని పలువురు ప్రశంసించారు. ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని డాక్టర్ అల్లూరి రామలింగయ్య ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల వైద్యులు శిబిరంలో రోగులకు హోమియో మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని కొవ్వూరి గంగిరెడ్డి, కె.విద్యాసాగర్ ప్రారంభించారు. ట్రస్టు వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణరెడ్డి, డైరెక్టర్ సత్తి సత్యనారాయణరెడ్డి, జీవీఎస్ఎన్ మూర్తి, వెలగల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీమా.. భారం

- ఉచిత పంటల బీమాను అటకెక్కించిన కూటమి సర్కారు
- బీమా నమోదుకు ఆగస్టు 15 తుది గడువు
- రైతులపై భారం లేకుండా ప్రీమియం చెల్లించిన గత ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వ తీరుపై అన్నదాతల ఆగ్రహం



మొగలిపాలెంలో సాగుకు సిద్ధం చేసిన నారుమడి

కాజులూరు: ఉచిత పంటల బీమాకు కూటమి ప్రభుత్వం ప్రీమియం సొమ్మును రైతులే చెల్లించాలన్న నిబంధనను తెరపైకి తెచ్చింది. ఈ పరిణామం రైతుల్లో ఆవేదన కలగజేస్తోంది. అప్పులు చేసి పంటలు సాగు చేస్తుంటే, ప్రభుత్వం తమకు ఏమాత్రం ప్రోత్సాహం అందించట్లేదని ఆవేదన చెందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి తమకు ఒక్క పైసా ఖర్చు లేకుండా ఉచిత పంటల బీమా అందించిందని అన్నదాతలు గుర్తు చేసుకుంటున్నారు.

ప్రీమియం చెల్లింపులు ఇలా..

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రామచంద్రపురం నియోజకవర్గంలో దాదాపు 52 వేల ఎకరాల్లో రైతులు వరి సాగుచేస్తున్నారు. ఖరీఫ్–2025 సీజను ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లింపునకు ఇటీవల ఉత్తర్వులు వెలువరించింది. ఎకరాకు రూ.770 చెల్లించాలని ఆగస్టు 15 వరకు గడువు విధించింది. వరి సాగు చేసిన పంటలకు రైతులే స్వయంగా పంటల వారీగా ప్రీమియం చెల్లించాలని పేర్కొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండానే పంటల బీమా అమలు చేసింది.

రైతుల పైనే భారం..

కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బీమా ప్రీమియం భారం రైతులపై పడింది. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి పంట సాగు చేసే ప్రతి రైతూ.. పంటల బీమా పొందాలంటే ప్రీమియం చెల్లించాల్సిందే. ప్రభుత్వ సాయం అందక పెట్టుబడులకు అప్పులు చేసిన రైతులు ప్రీమియం కూడా చెల్లించాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మళ్లీ రైతులకు కష్టాలు మొదలయ్యాయని నిట్టూర్చుతున్నారు. కూటమి సర్కార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.20వేలు ఆర్థిక సాయం అకౌంట్లలో ఎప్పుడు పడుతుందో స్పష్టత లేదు. ఇలాంటి సమయంలో ప్రీమియం చెల్లించడం కష్టంగా ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాగా, సమయం తక్కువగా ఉండటం, ప్రీమియాన్ని రైతులే చెల్లించాల్సి రావడంతో చాలా మంది బీమా నమోదు చేసేందుకు ముందుకు రాలేదు.

రైతులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం..

వ్యవసాయ రంగాన్ని, రైతులను ఆదుకునే దిశగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019–ఖరీఫ్ సీజన్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని తీసుకొచ్చింది. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ–క్రాప్ నమోదు ప్రామాణికంగా ఉచిత పంటల బీమాను అమలు చేశారు. రైతులు సాగు



ప్రీమియం చెల్లించిన రైతుకు రసీదు ఇస్తున్న ఏఓ అశోక్

చేసే మొత్తం విస్తీర్ణానికి చెల్లించాల్సిన ప్రీమియాన్ని ప్రభుత్వమే కట్టేలా చర్యలు తీసుకున్నారు. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా పథకం వర్తించడంతో పంటలకు నష్టం వాటిల్లిన ప్రతి సందర్భంలోనూ పూర్తిగా నష్టపరిహారం అందుకునే వాళ్లమని రైతులు అంటున్నారు. కౌలు రైతులకు సైతం పరిహారం అందించినట్లు చెబుతున్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా తమ ఖాతాలకే జమ చేసేవారని రైతులు అంటున్నారు.

ఉచిత బీమా అమలు చేయాల్సిందే..



ఉచిత పంటల బీమా రద్దు చేయడం అన్యాయం. కూటమి ప్రభుత్వం రాగానే రైతులను దెబ్బ తీసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత బీమాను కొనసాగించి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి. వ్యవసాయం చేయడం కష్టంగా మారిన నేపథ్యంలో ప్రీమియం భారాన్ని రైతులను భరించమనడం సరికాదు. దీనిపై కూటమి ప్రభుత్వం పునరాలోచించాలి. దీని వల్ల చిన్న, సన్నకారు రైతులపై తీవ్రమైన భారం పడుతుంది.

– కురుపూడి సూర్యనారాయణ, రైతు, ఆర్యావటం.

బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి



గతంలో అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకం మాలాంటి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పెట్టుబడికే డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటే.. బీమా ప్రీమియం భారం రైతులపై వేయడం సమంజసం కాదు. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడిసాయం అందజేయాలి.

–కాకి శ్రీనివాసరావు, రైతు, మతుకుమిల్లి.

వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో రామలక్ష్మణమూర్తి

రాయవరం: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలన్న లక్ష్యంతో విద్యాశాఖ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ప్రతి నెలా నిర్వహిస్తోందని రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి తెలిపారు. మండలంలోని చెల్లూరు, పసలపూడి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన శనివారం సందర్శించారు. సమావేశంలో డీవైఈవో రామలక్ష్మణమూర్తి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు వృత్తి నైపుణ్యాలను పెంచుకునే దిశగా ప్రయత్నించాలన్నారు. కాంప్లెక్స్ సమావేశాల్లో విషయ పరిజ్ఞానాన్ని, వృత్తి నైపుణ్యాలను పెంచుకునేందుకు అర్థవంతమైన చర్చలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్‌ల పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్కూల్ కాంప్లెక్స్ షెడ్యూల్ ఆధారంగా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించారు. రాయవరంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వీఎస్ సునీత, ఎన్.ఆదినారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఎమ్మెల్సీకి వినతిపత్రం



ఎమ్మెల్సీ గాదెకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులును పీఆర్‌టీయూ నాయకులు కలసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పీఆర్‌టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొగం అమృతరావు, జిల్లా మాజీ అధ్యక్షుడు టీవీవీఎస్ తిలక్‌బాబు, మండల అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు, కార్యదర్శి కొత్తుర్తి భీమశంకరం ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి వచ్చిన ఎమ్మెల్సీని కలసి వినతిపత్రం అందజేశారు. యాప్‌ల పని భారం తగ్గించాలని, ఎర్నింగ్ లీవ్స్, పెండింగ్ బకాయిలు చెల్లించాలని, పీఆర్‌సీ కమిషన్ త్వరితగతిన నియమించాలని, త్వరలో పెండింగ్ డీఏలు మంజూరు చేసి ఐఆర్ 30 శాతం మంజూరు చేయాలన్న డిమాండ్‌లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుబ్బల శ్రీను, పంపన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సమీక్ష



సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు

రామచంద్రపురం: పట్టణంలోని ముచ్చిమిల్లిలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు సీజనల్ వ్యాధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల సమయంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో ముచ్చిమిల్లి యూపీహెచ్‌సీ వైద్యాధికారి శివారెడ్డి, మండపేట, ద్రాక్షారామ ఎస్‌యూఓలు పి.థీస్ దయాళ్ బిసఫ్, నాగేంద్ర, హెల్త్ అసిస్టెంట్స్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దీపం-2 సొమ్ము జమ కాని తీరుపై సమీక్ష

కపిలేశ్వరపురం (మండపేట): దీపం–2 పథకం ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు సొమ్ము జమకాకపోవడంపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు రెవెన్యూ అధికారులు, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో మండపేటలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

నియోజకవర్గంలో 254 మందికి డబ్బులు పడలేదన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల తహసీల్దార్‌లు పి.తేజేశ్వరరావు, ఐపీ శెట్టి, జి.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ పీఏ మెహర్‌బాబా, పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ గాయత్రి పద్మ, ఎంపీడీఓ కె.సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, ఎంఈఓ ఎస్.రామచంద్రరావు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు హాజరయ్యారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



ద్రాక్షారామలో భద్రాచల రాముడి కల్యాణ వేడుక



భక్తులకు మంగళసూత్రం చూపిస్తున్న అర్చకులు



కల్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన భీమేశ్వరాలయ ఈఓ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ క్షేత్రంలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న సప్త సప్తాహ మహోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం భద్రాచల సీతారాములకు (భద్రాచలం నుంచి ప్రత్యేక కల్యాణ రథంపై శుక్రవారం తీసుకుని వచ్చారు.) వైభవంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. భద్రాచలం నుంచి వచ్చిన ఉప ప్రధాన అర్చకుడు వెంకట శ్రీనివాస రామానుజాచార్య, వేద పండితుడు నరసింహాచార్య స్వామి, ఎ.శ్రీకాంత్ కృష్ణమాచార్య, ఎస్.కిరణ్ కుమారాచార్యులు, భాస్కర రామాచార్యులు కల్యాణ వేడుకను వైభవోపేతంగా నిర్వహించారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. దాత మంచం ఆంజనేయమూర్తి (చిన్నబాబు) దంపతులు నిర్వహించిన రాముల వారి కల్యాణంలో భద్రాచలం రామాలయ ఈఓ ఎల్.రమాదేవి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీను, సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బొత్సను కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు



బొత్సకు స్వాగతం పలుకుతున్న నేతలు

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ శుక్రవారం మండపేటలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొమ్ము రాంబాబు నివాసాన్ని సందర్శించారు. రాంబాబు కోరిక మేరకు బొత్స, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోసు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిలకు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, రమణ, కొమ్ము రాంబాబు ఘన స్వాగతం పలికారు. పార్టీ సీనియర్ నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రెడ్డి రాజుబాబు పాల్గొన్నారు.

రేపు 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' సమావేశం



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): ఈనెల 21న మండపేట పట్టణం, రూరల్ మండల స్థాయిలో 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని విజయలక్ష్మి నగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సమావేశానికి మండపేట పట్టణం, రూరల్ మండలంలోని 12 గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని తోట కోరారు.

అశిరాంబ జాతరకు ఏర్పాట్లు



శ్రీఅశిరాంబ అమ్మవారు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ఆరాధ్య దైవమైన అశిరాంబ అమ్మవారి జాతర ఆదివారం ఆలయం వద్ద ప్రారంభించనున్నట్టు నిర్వాహక కమిటీ నాయకుడు రాగం రామచంద్రరావు శనివారం తెలిపారు. జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. గ్రామ వీధుల్లో జాతర, 21న తీర్థం, 22న అమ్మవారికి నైవేద్య సమర్పణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శ



బాధితుడుని పలకరిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: మండలంలోని నల్లూరుకు చెందిన యువకుడు వినయ్ కుమార్ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం ట్రాక్టర్‌తో దమ్ము చేస్తూ అదుపుతప్పడంతో వాహనంలో ఇరుక్కుపోయాడు. మండపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు తండ్రి శలబోయిన ఏడుకొండలు వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వెంటనే ఆసుపత్రికి వెళ్లి బాధితుడు, కుటుంబ సభ్యులను పలకరించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులతో మాట్లాడారు.

వాటర్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ కుటుంబానికి పరామర్శ

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడికి చెందిన కూళ్ల వాటర్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ మేకా శివ ప్రసాద్ ఈ నెల 16న మృతి చెందారు. 13న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో చికిత్స పొందుతూ చనిపోయారు. కాగా, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి హాని



హసన్‌బాదలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ సతీష్‌రావు



ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి, నాయకులు



పట్టణ వీధుల్లో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్

రామచంద్రపురం రూరల్: మండలంలోని గ్రామాల్లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. జగన్నాయకులపాలెంలో సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి పాల్గొన్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. హసన్‌బాదలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో మొక్కలు నాటి ర్యాలీ నిర్వహించారు. కాపవరంలో సర్పంచ్ యనమదల మంగాదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ రెడ్నం సతీష్ నేతృత్వంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థులు గ్రామంలో రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను శుభ్రం చేశారు. అదే విధంగా మండలంలోని 25 పంచాయతీల్లోనూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరం

కపిలేశ్వరపురం: మానవాళి మనుగడకు ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర' పేరుతో మున్సిపాలిటీ పరిధిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం మెప్మా ఆర్పీలు, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు ర్యాలీలో పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

రామచంద్రపురం: సమాజాన్ని అన్ని విధాలుగా నాశనం చేస్తూ, ప్రజల ఆరోగ్య భద్రతకు ముప్పు కలిగిస్తున్న ప్లాస్టిక్ నిరోధానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. తొలుత మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఓ ఉద్యమంలా సాగుతుందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఎన్ని సంపదలున్నా ఆరోగ్యం లేకుంటే శూన్యమన్నారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, నాయకులు చందమామ వాసు, మున్సిపల్ కౌన్సిలర్‌లు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడ అందరి బాధ్యత

కపిలేశ్వరపురం (మండపేట): మానవాళి మనుగడ కోసం కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జమాతె ఇస్లామీ హింద్ నాయకులు ఉద్ఘాటించారు. మహిళా విభాగం సభ్యురాలు జీనత్ ఆధ్వర్యంలో మండపేటలోని శ్రీచైతన్య పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ–బాధ్యత అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. విద్యార్థులతో మొక్కలు నాటించారు. చిల్డ్రన్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (సియో) జాతీయ స్థాయిలో రూపొందించిన కార్యాచరణను వివరించారు.